

ఎమ్మెల్యే రంగారెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎమ్మెల్యే రంగారెడ్డికి సన్మానం

ఓల్డ్‌మలక్‌పేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని బుధవారం ఓల్డ్‌మలక్‌పేట కాంగ్రెస్ నాయకులు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ కార్యకర్తలు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రణాళికతో తెలంగాణను అభివృద్ధి చేయటానికి కృషి చేస్తున్నారనీ, అందుకు అందరూ సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. అర్హులైన వారందరికీ పథకాలు అందుతాయన్నారు. ఎమ్మెల్యేని కలసిన వారిలో గ్రేటర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి బాబు శ్రీనివాస్, కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, చౌకి రవికుమార్, అబ్దుల్‌మన్నన్ తదితరులున్నారు.



ఆపరేషన్ స్మైల్ సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

బాల కార్మికులకు మంచి భవిష్యత్ ఇవ్వాలి

- హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బాల కార్మికులను గుర్తించి వాళ్లను తిరిగి బడిలో చేర్పించి మంచి భవిష్యత్ ఇవ్వాల్సిన సామాజిక బాధ్యత అందరిపై ఉందని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆపరేషన్ స్మైల్-10పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, మహిళా శిశు సంక్షేమ శాఖ, పోలీస్, కార్మిక, రెవెన్యూ, వైద్యఆరోగ్య శాఖ అధికారులందరూ సమన్వయంతో పనిచేసి బాల కార్మికులను వెంటనే విడుదల చేయించాలని సూచించారు. స్మైల్ ఆపరేషన్ విజయవంతం కావాలంటే పిల్లలు ఎక్కడ కనిపించినా వెంటనే 1098 ఫోన్ నెంబర్ ద్వారా సీడబ్ల్యూసీకి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్డీవో సూర్యప్రకాష్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ శైలజ, కార్మిక శాఖ అధికారి శ్యాంసుందర్ తదితర శాఖ అధికారులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న గోవుల పట్టివేత

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా గోవులను తరలిస్తున్న రెండు వాహనాలను అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు పట్టుకున్నారు. బుధవారం విజయవాడ వైపు నుంచి నగరానికి రెండు వాహనాల్లో గోవులను తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు బాటసింగారం అన్నమాచార్య కళాశాల సమీపంలో ఒక వాహనాన్ని, అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద మరోక వాహనాన్ని పట్టుకున్నారు. వాహనాల డ్రైవర్లతోపాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. గోవులను జీయాగూడలోని గోశాలకు తరలించారు.

ఘరానా చైన్ స్నాచర్ అరెస్టు

- ఎల్‌బీనగర్ సీసీఎస్ పోలీసులకు సీపీ అభినందన

హైదరాబాద్ సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మహిళల మెడలో గొలుసులు లాగేస్తూ.. పోలీసులకు దొరకకుండా తప్పించుకు తిరుగుతున్న ఘరానా చైన్ స్నాచర్‌ను పట్టుకొని సొత్తు రికవరీ చేసిన ఎల్బీనగర్ సీసీఎస్ పోలీసులను రాచకొండ సీపీ సుధీర్‌బాబు అభినందించారు. వివరాల్లోకి వెళ్తే.. చైన్ స్నాచర్ చెవుల ప్రశాంత్‌కుమార్ ఒంటరిగా వెళ్తున్న మహిళలను అడ్డగించి మెడలోని గొలుసులు లాక్కొని పారిపోతుంటాడు. అతనిపై రాచకొండ కమిషనరేట్ పరిధిలో పలు కేసులు నమోదై ఉన్నాయి. దాంతో సీసీఎస్ పోలీసులు నిందితుడిని పట్టుకోవడానికి ప్రత్యేక దృష్టి సారించారు. టెక్నికల్ ఎవిడెన్స్‌ను సేకరించిన ఎల్బీనగర్ సీసీఎస్ టీమ్ బుధవారం నిందితున్ని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ. 1లక్ష నగదు, గోల్డ్ చైన్, స్విఫ్ట్‌కారు, యాక్టివా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం సొత్తు విలువ రూ. 10.50లక్షలు ఉంటుందని తెలిపారు. చాకచక్యంగా ఘరానా స్నాచర్‌ను పట్టుకున్న సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌లు వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, గోవర్ధన్‌గిరి, ఎస్. విజయ్, రామకృష్ణ, ఎస్సై రవికుమార్ ఇతర సిబ్బందిని సీపీ అభినందించారు.



పాదుకలను మోసుకొస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

అయోధ్య రాములవారి వెండి పాదుకలకు ప్రత్యేక పూజలు

చాంద్రాయణగుట్ట/ యాకుత్‌పురా, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామమందిరం ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా శృంగేరి పీఠం నుంచి శ్రీరామామృత తరంగిణి పేరిట 16 నదుల ఇసుక, పుణ్య తీర్థాలతో రాములోరికి సమర్పించే వెండి పాదుకలను లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి ఆలయానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాదుకలకు ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కె.వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి బి.మారుతీ యాదవ్, ప్రచార కార్యదర్శి ఎ.వినోద్‌కుమార్, గడ్డం రవి స్వాగతం పలికారు. భక్తులు పాదుకలను దర్శించుకోవడానికి పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ సి.రాజేందర్‌యాదవ్, మాజీ చైర్మన్లు కె.విష్ణుగౌడ్, సి.రాజ్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



నియామకపత్రాలు అందజేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

బీజేవైఎం ఉపాధ్యక్షులు, కార్యదర్శుల నియామకం

వనస్థలిపురం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బీజేపీ యువమోర్చా ఉపాధ్యక్షులుగా లతీష్, కార్యదర్శిగా నిఖిల్‌లు నియామకం అయ్యారు. ఈ మేరకు బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి వారికి నియామక పత్రాలను అందజేసి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లో బీజేపీ బలోపేతానికి మరింతగా యువ మోర్చా నాయకులు, కార్యకర్తలు తమ వంతుగా కృషి చేయాలన్నారు. తమ నియామకానికి కృషి చెసిన కార్పొరేటర్ లచ్చిరెడ్డికి లతీష్, నిఖిల్‌లు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ యువమోర్చ అధ్యక్షులు గౌరీశంకర్, సంపత్, అక్బర్, అక్షయ్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

పండగ వేళ.. చోరీల ముప్పు ..!

- సంక్రాంతికి ఊరెళ్తున్నారా? ● పోలీసుల సూచనలు పాటించండి.. ● ఎల్‌బీనగర్ జోన్ డీసీపీ చల్లా ప్రవీణ్‌కుమార్

దిల్‌సుఖ్‌నగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సెలవులకు స్వగ్రామాలకు వెళ్లేవారు పోలీసుల సూచనలు పాటించి, దొంగతనాల నివారణకు సహకరించాలని ఎల్‌బీనగర్ జోన్ డీసీపీ చల్లా ప్రవీణ్‌కుమార్ సూచించారు. ఎల్‌బీనగర్ జోన్ డీసీపీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. ప్రజలు పోలీసులపై నమ్మకం ఉంచడంతో పాటు, బాధ్యతాయుతంగా వ్యవహరించినప్పుడే నేరాల నివారణ సులభతరమవుతుందన్నారు. దొంగతనాల నివారణ, శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా విధి నిర్వహణలో ముందుకు సాగడం జరుగుతుందన్నారు. పండుగ సెలవులకు ఇంటికి తాళాలు వేసి ఊర్లకు వెళ్లే ప్రజలు ఇంట్లో విలువైన ఆభరణాలు, నగదు ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవడం శ్రేయస్కరమన్నారు. ఊరు వెళ్లి వచ్చే వరకు నగదు, నగలు బ్యాంక్ లాకర్లలో భద్ర పరచుకోవాలని సూచించారు. ఇంటి పక్కన వారికి, సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇచ్చినట్లయితే ఆయా కాలనీలలో పోలీస్ గస్తీ మరింత పెంచడం జరుగుతుందన్నారు. రాత్రి వేళల్లో కాలనీలలో పోలీసు పెట్రోలింగ్ ముమ్మరం చేస్తున్నట్లు వెల్లడించారు. కాలనీలలో అనుమానస్పదంగా తిరిగే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండడంతో పాటు, వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. రాచకొండ కమిషనర్ ఆదేశానుసారం విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తునట్లు వివరించారు. గంజాయి క్రయ, విక్రయాల కట్టడి కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. కాలనీలలో గంజాయి క్రయ, విక్రయాలు జరుగుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. పోలీసులకు సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అన్నారు.

ప్రజలతో స్నేహపూర్వకంగా ఉండాలి



ప్రజలకు, బాధితులకు ఎలాంటి సమస్యలు తలెత్తినా, కింది స్థాయి సిబ్బంది సహకరించకపోయినా నేరుగా డీసీపీ కార్యాలయానికి వచ్చి తనను సంప్రదించవచ్చని ఎల్‌బీనగర్ జోన్ డీసీపీ చల్లా ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేశారు. పోలీసు సిబ్బంది ప్రజలతో స్నేహపూర్వకంగా ఉన్నప్పుడే పోలీసులతో వారు తమ సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకోగలరని సూచించారు. విధుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండకుండా నిక్కచ్చిగా వ్యవహరించాలన్నారు. సివిల్ తగాదాల్లో తలదూర్చే పోలీసులు ఇబ్బందుల పాలు కావాల్సి వస్తుందన్నారు. అలాంటి సిబ్బందిపై చర్యల కోసం వెంటనే కమిషనర్‌కు నివేదిక పంపిస్తామని హెచ్చరించారు. దొంగతనాల నివారణతో పాటు, సైబర్‌నేరాల కట్టడిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు.

'డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల తాళాలు ఇప్పించండి'

- ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసిన లబ్ధిదారులు



ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసిన డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులు

ఎల్‌బీనగర్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్ రూమ్‌కు సంబంధించిన పట్టాలు ఇచ్చారు.. కానీ, ఇళ్ల తాళాలు ఇవ్వలేదని లబ్ధిదారులు మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న తమకు ఇళ్లను మంజూరు చేసి పట్టాలు ఇచ్చారని, ఇప్పటి వరకు తమకు పొజిషన్, తాళాలు ఇవ్వలేదని వాపోయారు. ఎన్నికలు పూర్తి అయి నెల దాటినా తమకు పొజిషన్ ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక చొరవ తీసుకుని తమకు కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పొజిషన్‌తో పాటు తాళాలు ఇప్పించాలని వారు సబితా ఇంద్రారెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు సక్కుబాయి, మంజుల, హైమావతి, శోభారాణి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

రంగవల్లులతో అలరించిన అతివలు



బహుమతులు అందజేస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు జగదీష్, ప్రధాన కార్యదర్శి రమేష్

ఎల్‌బీనగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని సరూర్‌నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీ మహిళా మండలి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో పాల్గొన్న మహిళలు తమ సృజనాత్మకతను కనబర్చి అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. విజేతలకు డాక్టర్స్ కాలనీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ జిగిని రామమూర్తి, ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్ రావు, ఉపాధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డిలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు మమత, ప్రధాన కార్యదర్శి సరిత, కోశాధికారి నిత్య, ఉపాధ్యక్షులు రామలక్ష్మి, జ్యోతి, సంయుక్త కార్యదర్శులు సునిత, రాధిక, ఆర్గనైజింగ్ సెక్రటరీ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ వైట్ హౌస్‌లో...

సరూర్‌నగర్‌లోని శ్రీలక్ష్మీ వైట్ హౌస్ షాపింగ్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలో మహిళలు పాల్గొని అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మీ వైట్ హౌస్ షాపింగ్ మాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది జగదీష్‌నేత, ప్రధాన కార్యదర్శి తడ్క రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గురువులను గౌరవించాలి

- సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి



మాట్లాడుతున్న సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి

చాదర్‌ఘాట్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అత్యధికంగా యువత ఉన్న దేశంగా గుర్తింపు పొందిన భారతదేశం.. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సాధనలో కూడా పోటీ పడుతుందని సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ ఆర్.దిలీప్‌రెడ్డి అన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని అవంతి పీజీ కళాశాలలో అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన యువ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య విజ్ఞానాన్ని ఇస్తుందని, ఆ విద్యని అందించే గురువులను గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. గౌరవ అతిథిగా విచ్చేసిన ఓయూ తెలుగు డిపార్ట్‌మెంట్ రిటైర్డ్ ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. యువత ఆత్మవిశ్వాసం, ఆత్మ నియంత్రణ, ఆత్మ త్యాగం వంటి లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాల హెచ్‌ఆర్ డైరెక్టర్ జయప్రద మాట్లాడుతూ.. స్వామి వివేకానంద భారతీయుల గురించి, భారతదేశం ప్రత్యేకతను ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడని కొనియాడారు. యువ కార్యక్రమంలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అప్పారావు, ప్రోగ్రాం ఆర్గనైజర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ ఫారెస్ట్ డైరెక్టర్‌గా ప్రదీప్‌కుమార్

హైదరాబాద్ సిటీ, జనవరి10 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎండీఏ అర్బన్ ఫారెస్ట్ డైరెక్టర్‌గా ఎస్.వి.ప్రదీప్ కుమార్‌శెట్టి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత డైరెక్టర్ డాక్టర్ బి.ప్రభాకర్ ఆయనకు బాధ్యతలు అప్పగించారు.

పతంగుల తయారీపై శిక్షణ

హైదరాబాద్ సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి నేపథ్యంలో మనకు నచ్చిన డిజైన్‌లో గాలిపటాలు తయారు చేసుకోవచ్చునని అంటోంది సింప్లీ నామ్‌ధారీ. ఇందుకోసం 5 నుంచి 12 సంవత్సరాల లోపు పిల్లల కోసం జనవరి 13న బంజారాహిల్స్‌లోని తమ స్టోర్‌లో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. వర్క్‌షాప్‌లో గాలిపటాల తయారీలో శిక్షణ ఇవ్వడంతో పాటు బహుమతులను కూడా గెలుచుకునే అవకాశం ఉందని తెలిపారు. వివరాలకు 63022 41108కు కాల్ చేయవచ్చని వారు తెలిపారు.

రైలుకు ఎదురుగా వెళ్లి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : రైలుకు ఎదురుగా వచ్చి దాని కిందపడి ఓ గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన డబీర్‌పూర రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. డబీల్‌పుర రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం రాత్రి రైలుకు ఎదురుగా ఓ గుర్తుతెలియని వ్యక్తి వచ్చి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని రైల్వే పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అహకారం వీడితేనే భగవంతున్ని స్మరించుకుంటాం

- ప్రముఖ ప్రవచనకర్త శ్రీమాన్ కోయిల్ కందాడై బంగారు వరదరాజన్



కార్యక్రమంలో పాల్గొన్న శ్రీమాన్ కోయిల్ కందాడై బంగారు వరదరాజన్

వనస్థలిపురం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మనసులో అహకారం తొలగిననాడే భగవంతున్ని స్మరించుకుంటామనీ ప్రముఖ ప్రవచనకర్త శ్రీమాన్ కోయిల్ కందాడై బంగారు వరదరాజన్ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ సౌజన్యంతో బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్‌లోని ప్రసిద్ధ త్రినేత్ర ఆంజనేయ స్వామి దేవాలయంలో ధనుర్మాస తిరుప్పావై ప్రవచన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రవచనకర్త శ్రీమాన్ కోయిల్ కందాడై బంగారు వరదరాజన్ మాట్లాడుతూ.. మానవుడు తొలగించుకోవాల్సిన గుణాలను, అలవర్చుకోవాల్సిన సుగుణములను మనకు గోదాదేవి తన దివ్య ప్రబంధంతో తెలిపిన విషయాలను భక్తులకు వివరించారు. ప్రతి ఒక్కరు ధర్మాన్ని కాపాడితే ధర్మం మనల్ని కాపాడుతుందన్నారు.మనసులో అహకారం తొలగిననాడే భగవంతున్ని స్మరించుకుంటామనేది అందరు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాలధారణ స్వాములు, ఆలయ కమీటి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కొత్తపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జీవితం పై విరక్తి చెందిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ దయాకర్ రెడ్డి తెలిపిన వివరాలు.... కాకతీయ కాలనీలో ఉండే ఆకుల ప్రశాంత్ (27) తీవ్ర అనారోగ్యంతో సతమతమవుతున్నాడు. బుధవారం సాయంత్రం తల్లితో కలిసి అతడి సోదరి మామిడి పరమేశ్వరి మందులు తీసుకు వచ్చేందుకు బయటకు వెళ్లింది. తిరిగి వచ్చి చూసేసరికి ప్రశాంత్ సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృత దేహన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. పరమేశ్వరి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ బంధు నిధులు విడుదల చేయాలి

మన్సూరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బీసీ బంధు పథకం కింద ఎన్నికలకు ముందు ఎంపిక చేసిన లబ్ధిదారులకు నిధులను వెంటనే విడుదల చేయాలని బీసీ చేతి వృత్తిదారుల సంఘం నాయకులు పేర్కొన్నారు. వంశరాజ్ సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు శ్యామల యాదగిరి ఆధ్వర్యంలో ఆయా చేతి వృత్తిదారుల సంఘాల నేతలతో సమావేశాన్ని బుధవారం నాగోల్‌లో నిర్వహించారు. నాయిబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్ల బాలకృష్ణతో కలిసి యాదగిరి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హాయంలో ఎంతో మందిని బీసీ బంధు లబ్ధిదారులుగా ఎంపిక చేశారని, ఎన్నికల కోడ్ కారణంగా నిధులు విడుదల చేయలేదన్నారు. కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం సదరు పథకాన్ని కొనసాగిస్తూ లబ్ధిదారులందరికీ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి దుబాయ్ నర్సింహులు, మావళ్ల సాయి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన జక్కిడి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన పీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి

మన్సూరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిని పీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ప్రమాదానికి గురై చేయికి గాయమైన నేపథ్యంలో ప్రభాకర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిని సీఎం అడిగి తెలుసుకున్నారు.

31 వరకు ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలు

హయత్‌నగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 31 వరకు అవకాశం ఉందని హయత్‌నగర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జ్యోత్స్నప్రభ, సహాయ కేంద్రం కో-ఆర్డినేటర్ శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సుల్లో చేరేందుకు ఫీజు, తదితర వివరాలను తెలుసుకునేందుకు యూనివర్సిటీ వెబ్ సైట్‌లో చూసుకోవాలన్నారు. ద్వితీయ, తృతీయ సంవత్సరంలోని విద్యార్థులు తమ ఫీజులను ఈనెల 31లోగా ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. అదే విధంగా మూడో సెమిస్టార్, ఐదో సెమిస్టార్ విద్యార్థులు పరీక్ష ఫీజును ఈ నెల 17లోగా ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. ఇతర వివరాలకు 73829 29771లో సంప్రదించాలన్నారు.



తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకి వినతిపత్రం అందజేస్తున్న టీపీసీసీ సేవాదళ్ చైర్మన్ మిద్దెల జితేందర్

'సేవాదళ్'కు నామినేటెడ్ పోస్టులు కేటాయించాలి

చంపాపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ సభ్యులకు ప్రభుత్వంలో నామినేటెడ్ పోస్టులు కేటాయించాలని టీపీసీసీ సేవాదళ్ చైర్మన్ మిద్దెల జితేందర్ అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని మిద్దెల జితేందర్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన చంపాపేటలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. ప్రభుత్వంలో పలు నామినేటెడ్ పదవులలో చైర్మన్స్, డైరెక్టర్స్ పదవులలో సేవాదళ్ సభ్యులను నియమించాలని కోరినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సంతోష్‌నగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని 11కేవీ రాఘవేంద్రకాలనీ, స్వాతిరెసిడెన్సీ, వీరభద్రకాలనీ, బీరప్పటెంపుల్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలలో చెట్లు కొట్టివేత, నిర్వహణ పనుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ తెలిపారు. 11కేవీ రాఘవేంద్రకాలనీ, స్వాతిరెసిడెన్సీ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు, 11కేవీ వీరభద్రకాలనీ, బీరప్పటెంపుల్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

వనస్థలిపురం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటే క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకుని పోటీల్లో రాణించాలని నక్క వెంకటమ్మ యాదవ్, నక్క యాదగిరిస్వామి యాదవ్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ నక్క శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈనెల 11 నుంచి14 వరకు సిద్దిపేటలో జరిగే 49వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్‌లోని నక్క భాగ్యమ్మ యాదవ్, నక్క బాలమ్మ యాదవ్, నక్క వెంకటమ్మ స్వామి యాదవ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు హైదరాబాద్ జట్టుకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీఇటీ శ్రీనివాస్ నాయక్, నాగశేషులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మన్సూరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 సంవత్సర క్యాలెండర్‌ను మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బద్దుల బాబూరావుయాదవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ చింతల రవీందర్‌యాదవ్ నాగోల్‌లోని శుభం కన్వెన్షన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్‌యాదవ్, శేఖర్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, శ్రీహరియాదవ్ పాల్గొన్నారు.



స్మార్ట్‌వార్డు సిస్టం ప్రారంభోత్సవంలో ఆస్పత్రి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు, వైద్యులు

రాష్ట్రంలో తొలిసారిగా 'కిమ్స్'లో స్మార్ట్‌వార్డు

రాయదుర్గం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొలిసారిగా కొండాపూర్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో స్మార్ట్‌వార్డు సిస్టంను డోజి టెక్నాలజీ కంపెనీ భాగస్వామ్యంతో అందుబాటులోకి తీసుకొచ్చామని డాక్టర్ సుధీర్ తెలిపారు.

ఈ టెక్నాలజీ సహకారంతో రోగుల సంరక్షణ మరింత సులువవుతుందన్నారు. ఎన్‌హ్యాండ్స్ సేఫ్టీవింగ్ ప్రోగ్రామ్‌తో డోజీ టెక్నాలజీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత కాంటాక్ట్‌లెస్ రిమోట్ పేషెంట్ మానిటరింగ్, ఎర్లీ వార్నింగ్ సిస్టమ్(ఈడబ్ల్యూఎస్) రోగి ఉన్న బెడ్‌కు అనుసంధానం చేయడం ద్వారా రోగి పల్స్, హార్ట్ బీట్, శ్వాస ఎప్పటికప్పుడు ఈ టెక్నాలజీ ద్వారా గుర్తించి డాక్టర్లు, నర్సులకు ఎప్పటికప్పుడు అందజేస్తాయన్నారు.

దీంతో పేషెంట్ పర్యవేక్షణ. భద్రత, క్లినికల్ ఫలితాలు మెరుగుపడతాయన్నారు. కిమ్స్ ఆస్పత్రి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు మాట్లాడుతూ.. చికిత్సకు ఈ టెక్నాలజీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. డోజి సంస్థ సీఈవో, సహవ్యవస్థాపకులు ముదిత్ దండువాటే మాట్లాడారు.

13న శ్రీ గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం

కొత్తపేట, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కొత్తపేట మారుతీనగర్ శ్వేతాగార్డెన్స్‌లో ఈ నెల 13వ తేదీన శ్రీ గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవ వేడులను నిర్వహించనున్నట్లు ఆధ్యాత్మిక సామాజిక సేవా సంస్థ శ్రీలక్ష్మీనారాయణ సేవా సమితి నిర్వాహకురాలు దివ్యశ్రీ రమణ చక్రవర్తుల తెలిపారు. బుధవారం కొత్తపేటలో ఆమె వేడుకల కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సేవాసమితి డైరెక్టర్ వెంకటరమణాచార్యులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.